మన తెలుగు దిన పత్రిక
# ప్రజా గళం
R.NO. T/TG/2026/0111/2018/1268

హైదరాబాద్ సంపుటి : 1 సంచిక 17 గురువారం 21 మే 2026 పేజిలు :08 వెల:రూ.5/-

## హెరిటేజ్ వాక్‌కు కలెక్టర్ శ్రీకారం



3లో..

# వడగాలులపై సీఎం అప్రమత్తం

**ఉత్తర తెలంగాణ జిల్లాలకు హెచ్చరికలు**
**ఆసుపత్రులు సిద్ధంగా ఉండాలన్న ఆదేశాలు**
**తాగునీరు, చలివేంద్రాలపై ప్రత్యేక దృష్టి**



**హైదరాబాద్, మే 20 (మన ప్రజాగళం):** రాష్ట్రంలో తీవ్ర వడగాలులు, ఎండ తీవ్రత పెరిగే అవకాశాలపై వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సూచించారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండల తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉన్నందున జిల్లా అధికారులు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వడగాలుల ప్రభావం వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. ప్రతి ప్రాంతంలో అవసరమైన మేర ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ప్రజలకు తాగునీటి కొరత లేకుండా చూడడంతో పాటు విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఆరోగ్య శాఖ అధికారులు కూడా పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి జిల్లా ఆసుపత్రుల వరకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. వడదెబ్బ కారణంగా ఎవరైనా ఆసుపత్రుల్లో చేరితే వారికి వెంటనే వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో అవసరమైన మేరకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలను వేగంగా అమలు చేయాలని అధికారులకు తెలిపారు. ముఖ్యంగా జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. మధ్యాహ్న సమయంలో అత్యవసరం అయితే తప్ప ప్రయాణాలు చేయకుండా ఉండాలని ప్రజలకు

మిగతా 2 లో..

## తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగ్గుమంటున్న ప్రతాపం

- పిడుగురాళ్లలో అత్యధికంగా 47.6 డిగ్రీలు నమోదు
- తెలంగాణలో నిర్మల్ 46.5 డిగ్రీలతో ఉక్కపోత
- మరో నాలుగు రోజుల పాటు ఎండల తీవ్రతపై హెచ్చరికలు

**హైదరాబాద్, మే 20(మన ప్రజాగళం):** తెలుగు రాష్ట్రాల్లో భానుడు తన ప్రతాపాన్ని కొనసాగిస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలు జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. .



మిగతా 2 లో..

## సీఎం రేవంత్‌ను కలిసిన ఐఏఎస్‌లు

**శిక్షణలో ఉన్న అధికారుల మర్యాద భేటీ**
**మానవ వనరుల సంస్థలో సమావేశం**
**పాలనపై సీఎం సూచనలు చేసే అవకాశం**



**హైదరాబాద్, మే 20 (మన ప్రజాగళం):** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని రెండువేల ఇరవై ఐదు బ్యాచ్‌కు చెందిన శిక్షణలో ఉన్న ఐఏఎస్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశం హైదరాబాద్‌లోని మానవ వనరుల అభివృద్ధి సంస్థలోని బోధి పెవిలియన్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఉపాధ్యక్షురాలు శాంతి కుమారి, కోర్సు డైరెక్టర్ డాక్టర్ కందుకూరి

మిగతా 2 లో..

## కేంద్రానికి భట్టి కీలక వినతి

**తెలంగాణకు అదనపు నిధుల అభ్యర్థన**
**విద్యా రంగానికి భారీ పెట్టుబడుల ప్రతిపాదన**
**మూలధన వ్యయాలకు ప్రత్యేక సహాయం కోరిన ఉప ముఖ్యమంత్రి**



**న్యూఢిల్లీ, మే 20 (మన ప్రజాగళం):** తెలంగాణ అభివృద్ధి, విద్యా రంగ విస్తరణకు అదనపు ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ను కోరారు. న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతులు, విద్యా రంగ పెట్టుబడులపై కీలక చర్చలు జరిపారు. ప్రత్యేక సహాయ పథకం కింద తెలంగాణకు అదనంగా ఐదు వేల కోట్ల రూపాయల ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని భట్టి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుకు మరింత ఆర్థిక మద్దతు అవసరమని వివరించారు. రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ గత కొన్నేళ్లలో ప్రత్యేక ప్రయోజన సంస్థల ద్వారా తీసుకున్న అప్పుల భారం ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతోందని ఉప ముఖ్యమంత్రి వివరించారు. అయినప్పటికీ విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం భారీ స్థాయిలో పెట్టుబడులు కొనసాగిస్తోందని తెలిపారు. యంగ్ ఇండియా సమగ్ర నివాస పాఠశాలల ద్వారా విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర మంత్రికి వివరించారు. జిల్లాల వారీగా కొత్త వైద్య కళాశాలలు, గ్రామీణ ఆరోగ్య సేవల విస్తరణ, విద్యా మౌలిక వసతుల బలోపేతంపై దృష్టి సారించినట్లు

మిగతా 2 లో..

## సరస్వతీ అంత్య పుష్కరాలకు
# భారీ ఏర్పాట్లు

- మే 21 నుంచి కాళేశ్వరంలో పుష్కర వేడుకలు
- భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- రాష్ట్ర ప్రజలకు సీఎం శుభాకాంక్షలు



**కాళేశ్వరం, మే 20 (మన ప్రజాగళం):** సరస్వతీ అంత్య పుష్కరాలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మే 21 నుంచి జూన్ 1 వరకు కాళేశ్వరంలో జరగనున్న పుష్కరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశాలు ఉన్న నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశించారు. పుష్కరాల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని సూచించారు. పుష్కర స్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సీఎం పేర్కొన్నారు. స్నాన ఘాట్ల వద్ద భద్రత, తాగునీరు, వైద్య

మిగతా 2 లో..

## పోక్సో కేసులో సాక్ష్యాల మాయం యత్నం?


- ఫోన్ డేటా డిలీట్ చేసినట్లు పోలీసుల అనుమానం
- అదనపు సెక్షన్లు జోడించిన దర్యాప్తు అధికారులు
- ఆధునిక సాంకేతికతతో డేటా రికవరీకి ప్రయత్నాలు

**హైదరాబాద్, మే 20 (మన ప్రజాగళం):** దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన పోక్సో కేసు దర్యాప్తులో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్ సాక్ష్యాలను



మిగతా 2 లో..

## మోదీ--మట్టరెల్లా కీలక భేటీ



2 లో..

## పుతిన్ చైనా పర్యటన ఆసక్తికరం



**బీజింగ్‌లో పుతిన్‌కు ఘన స్వాగతం**
**జిన్‌పింగ్‌తో కీలక భేటీ చర్చలు**
**అంతర్జాతీయ అంశాలపై దృష్టి సారింపు**

**బీజింగ్, మే 20(మన ప్రజాగళం):** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్

మిగతా 2 లో..


## విలేఖరులు కావలెను...

విశేష ఆదరణతో దూసుకుపోతున్న తెలుగు దినపత్రిక "మన ప్రజాగళం" పత్రికలో పనిచేయుటకు రిపోర్టర్లు, మండలల్లా వారీగా.మరియు నియోజకవర్గ ఇన్‌చార్జిలు, జిల్లా స్టాఫర్లు కావాలెను.

వివరాలకు సంప్రదించవలసిన పోన్ నెంబరు.
9390 875876


## ఖండూరికి నివాళులర్పించిన ఉపరాష్ట్రపతి

**డెహ్రాడూన్‌లో నివాసానికి వెళ్లిన ఉపరాష్ట్రపతి**
**మాజీ ముఖ్యమంత్రికి ఘన నివాళులు**
**దేశసేవలను గుర్తుచేసుకున్న నాయకులు**




**డెహ్రాడూన్, మే 20 (మన ప్రజాగళం):** భారత ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి, మాజీ కేంద్ర మంత్రి బి. సి. ఖండూరికు ఘన నివాళు లర్పించారు. డెహ్రాడూన్‌లోని ఆయన నివాసానికి వెళ్లి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఖండూరి దేశానికి అందించిన సేవలను ఉపరాష్ట్రపతి గుర్తుచేసుద కున్నారు. ఆయన అసాధారణ నాయకుడిగానే కాకుండా గొప్ప

మిగతా 2 లో..

## మోదీ--మెలోనీ భేటీ ఆసక్తికరం

**రోమ్ చేరుకున్న ప్రధాని మోదీ**
**మెలోనీతో విందు సమావేశం**
**భారత్--ఇటలీ సంబంధాలపై చర్చ**



2 లో..

# కులగణనకు సుప్రీం గ్రీన్ సిగ్నల్

**పిటిషన్లను కొట్టివేసిన ధర్మాసనం**
**ప్రభుత్వ విధాన నిర్ణయమని స్పష్టీకరణ**
**సంక్షేమ పథకాలకు ఉపయోగపడుతుందని వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ, మే 20 (మన ప్రజాగళం):** దేశంలో కులగణన ప్రక్రియకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. కులగణనను వ్యతిరేకిస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాలను కొట్టివేస్తూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి అత్యున్నత న్యాయస్థానం అనుకూలంగా



మిగతా 2 లో..

# సరస్వతీ అంత్య పుష్కరాలకు భారీ ఏర్పాట్లు



(మొదటి పేజీ తరువాయి..)

సేవలు, పారిశుద్ధ్య సదుపాయాలు, విశ్రాంతి కేంద్రాలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. భక్తుల రాకపోకలకు ఆటంకం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వాహనాల పార్కింగ్, మార్గదర్శక బోర్డులు, ప్రత్యేక రవాణా ఏర్పాట్లపై సంబంధిత శాఖలు సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్లాలని పేర్కొన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా భక్తులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో నీరు ఎక్కువగా తీసుకోవడం, అవసరమైన జాగ్రత్తలు పాటించడం ద్వారా ఆరోగ్య సమస్యలను నివారించాలని కోరారు. ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రశాంతంగా, భక్తిపూర్వకంగా సరస్వతీ అంత్య పుష్కరాలు జరగాలని సీఎం ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరికీ పుష్కర శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు

## తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగ్గుమంటున్న ప్రతాపం

(మొదటి పేజీ తరువాయి..)

వాతావరణ శాఖ, విపత్తుల నిర్వహణ సంస్థల హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు. రాష్ట్రాల్లో రానున్న రోజుల్లో కూడా వేడి తీవ్రత కొనసాగనున్నట్లు అంచనా వేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 47.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కృష్ణా జిల్లా కంకిపాడు, మార్కాపురం పరిధిలోని నందనమారెళ్లలో 46.1 డిగ్రీలు, తణుకులో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని 11 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. తెలంగాణలో కూడా ఎండల తీవ్రత ఏమాత్రం తగ్గలేదు. నిర్మల్‌లో 46.5 డిగ్రీలు నమోదు కాగా, హనుమకొండలో 46.4 డిగ్రీలు, జగిత్యాలలో 46.3 డిగ్రీలు, ఆదిలాబాద్‌లో 46.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 19 జిల్లాల్లో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో తీవ్రమైన వడగాలులపై ఎర్ర హెచ్చరికలు కూడా జారీ చేసినట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్‌లో వేడి గాలులతో పాటు ఉక్కపోత కూడా ప్రజలను ఇబ్బంది పెడుతోంది. రాష్ట్రంలో ఐదు రోజుల పాటు వడగాలుల ప్రభావం కొనసాగవచ్చని వాతావరణ శాఖ హెచ్చరించింది. అధిక ఉష్ణోగ్రతలతో పాటు తేమ శాతం కూడా పెరగడంతో ప్రజలు మరింత అసౌకర్యానికి గురయ్యే అవకాశముందని పేర్కొంది.రానున్న నాలుగు రోజుల పాటు ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని సూచించింది. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రజలు ఎక్కువగా నీరు తాగడం, మజ్జిగ, కొబ్బరి నీరు, పండ్ల రసాలు తీసుకోవడం, తేలికపాటి దుస్తులు ధరించడం మంచిదని అధికారులు సూచిస్తున్నారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆరోగ్యశాఖ హెచ్చరించింది. దేశవ్యాప్తంగా కూడా తీవ్రమైన వేడి పరిస్థితులు కొనసాగుతున్నట్లు వాతావరణ సంస్థలు వెల్లడిస్తున్నాయి

## పోక్సో కేసులో సాక్ష్యాల మాయం యత్నం?

(మొదటి పేజీ తరువాయి..)

ధ్వంసం చేసేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదైన వెంటనే ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి పరారీలో ఉన్న సమయంలో ఫోన్‌లోని కీలక సమాచారం తొలగించినట్లు దర్యాప్తులో ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం.ఈ నెల ఎనిమిదో తేదీన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన తర్వాత నిందితుడు తన ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేసి అదృశ్యమైనట్లు అధికారులు చెబుతున్నారు. పరారీలో ఉన్న సమయంలో పథకం ప్రకారం తన అత్యాధునిక ఐఫోన్‌లోని వీడియోలు, చాటింగ్ వివరాలు, ఇతర కీలక డేటాను తొలగించడంతో పాటు సామాజిక మాధ్యమ ఖాతాలను కూడా మాయం చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అరెస్ట్ అనంతరం పోలీసులు స్వాధీనం చేసుకున్న ఫోన్‌లో సిమ్ కార్డు లేకపోవడం, పరికరం పూర్తిగా ఖాళీగా ఉండటం దర్యాప్తులో కీలక అంశంగా మారింది. దీంతో సాక్ష్యాలను ధ్వంసం చేసిన నేరం కింద అదనంగా సంబంధిత చట్టపరమైన సెక్షన్లను కూడా జోడించినట్లు సమాచారం. ఫోన్‌ను పలుమార్లు ఫార్మాట్ చేసి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. అయితే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో డిలీట్ చేసిన డేటాను తిరిగి రాబట్టే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఫోరెన్సిక్ సైన్స్ ప్రయోగశాల నిపుణుల సహకారంతో ఫోన్‌లోని తొలగించిన సమాచారం రికవరీ చేసే ప్రక్రియ ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఐఫోన్ భద్రతా వ్యవస్థ కఠినంగా ఉన్నప్పటికీ ప్రత్యేక ఫోరెన్సిక్ సాఫ్ట్‌వేర్‌ల సాయంతో చాటింగ్, ఫొటోలు, వీడియోలు తిరిగి పొందే అవకాశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఒకవేళ అంతర్గత సమాచారం పూర్తిగా తొలగించినా క్లౌడ్ ఆధారిత నిల్వల ద్వారా సమాచారం సేకరించే అవకాశాలను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇదే సమయంలో నిందితుడు ఫోన్ స్విచ్ఛాఫ్ చేసే ముందు ఎక్కడ ఉన్నాడు, ఎవరితో మాట్లాడాడు, ఎవరెవరు ఆశ్రయం కల్పించారు వంటి అంశాలపై పోలీసులు దృష్టి సారించారు. సెల్‌టవర్ మ్యాపింగ్, కాల్ డేటా రికార్డులు, డిజిటల్ ఆధారాలను క్షుణ్ణంగా విశ్లేషిస్తున్నట్లు తెలుస్తోంది. దర్యాప్తులో ఎలాంటి ఆటంకాలు ఎదురైనా ప్రత్యామ్నాయ వ్యూహాన్ని కూడా పోలీసులు సిద్ధం చేసినట్లు సమాచారం. ఇందులో భాగంగా బాధితురాలి ఫోన్‌లోని సమాచారాన్ని కీలక ఆధారంగా పరిశీలించే అవకాశం ఉందని తెలుస్తోంది. నిందితుడు పంపిన సందేశాలు, ఫొటోలు, వీడియోలు వంటి సమాచారాన్ని సాంకేతికంగా ధ్రువీకరించి దర్యాప్తులో వినియోగించనున్నారు. పోక్సో కేసుల్లో సాక్ష్యాల తారుమారుకు ప్రయత్నించడం దర్యాప్తు తీవ్రతను మరింత పెంచుతుందని న్యాయ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నందున పూర్తి వివరాలు అధికారిక విచారణ అనంతరం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## ఖండూరికి నివాళులర్పించిన ఉపరాష్ట్రపతి

(మొదటి పేజీ తరువాయి..)

సైనికాధికారి, అనుభవజ్ఞుడైన పరిపాలకుడిగా దేశ ప్రజల మన్ననలు పొందారని పేర్కొన్నారు. దేశ ప్రజల సేవకే తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తిగా ఖండూరి నిలిచిపోయారని ఉపరాష్ట్రపతి తెలిపారు. ప్రజా జీవితంలో ఆయన క్రమశిక్షణ, అంకితభావం అనుసరణీయమని కొనియాడారు. దేశ రహదారుల అభివృద్ధి, అనుసంధాన వ్యవస్థ బలోపేతంలో ఖండూరి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. మౌలిక వసతుల అభివృద్ధికి ఆయన చేసిన కృషి దేశ చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు.సైన్యంలో సేవలందించిన అనంతరం రాజకీయాల్లోకి ప్రవేశించి ప్రజా సేవలో తనదైన ముద్ర వేసిన నాయకుడిగా ఖండూరి గుర్తింపు పొందారని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆయన పరిపాలనా అనుభవం దేశాభివృద్ధికి ఎంతో దోహదపడిందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఖండూరి సేవలు, వారసత్వం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. దేశానికి విశిష్ట సేవలందించిన నాయకులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.

## మోదీ--మెలోనీ భేటీ ఆసక్తికరం

**న్యూఢిల్లీ, మే 20 (మన ప్రజాగళం):**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటలీ పర్యటనలో భాగంగా రోమ్ చేరుకున్నారు. అక్కడికి చేరుకున్న అనంతరం ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక సంబంధాలపై కీలక చర్చలు జరిగినట్లు సమాచారం. రోమ్ చేరుకున్న తర్వాత ప్రధాని మోదీ ముందుగా మెలోనీతో విందు సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ప్రపంచ ప్రఖ్యాత చారిత్రక కట్టడం కొలొసియంను సందర్శించినట్లు వెల్లడించారు. ఈ సందర్శనకు సంబంధించిన వివరాలను మోదీ సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్నారు.

భారత్, ఇటలీ మధ్య ఉన్న స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించినట్లు తెలుస్తోంది. ఆర్థిక, వ్యాపార, రక్షణ, సాంకేతిక రంగాలతో పాటు పలు అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నట్లు మోదీ పేర్కొన్నారు. భారత్--ఇటలీ సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా తమ చర్చలు కొనసాగనున్నాయని ప్రధాని మోదీ వెల్లడించారు. ఈ సమావేశం ద్వారా ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ప్రధాని మోదీ విదేశీ పర్యటనల్లో భాగంగా ప్రపంచ నేతలతో తరచూ భేటీలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాలు అంతర్జాతీయ వేదికలపై భారత స్థానాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. భారత్--ఇటలీ మధ్య ఉన్న స్నేహ బంధం రాబోయే రోజుల్లో మరింత విస్తరించనుందని, కొత్త ఒప్పందాలు, సహకార కార్యక్రమాలకు ఈ చర్చలు దారి తీసే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.

## కులగణనకు సుప్రీం గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి..)

స్పందించింది. కులాల లెక్కింపు అంశం పూర్తిగా ప్రభుత్వ విధాన పరిధిలోకి వస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ అంశంపై విచారణ చేపట్టింది. కులగణన నిర్వహించాలా వద్దా అనేది విధానపరమైన అంశమని, అలాంటి నిర్ణయాల్లో న్యాయస్థానాల జోక్యం ఉండదని ధర్మాసనం పేర్కొంది. సమాజంలో వెనుకబడిన వర్గాల సంఖ్య, వారి పరిస్థితులపై ప్రభుత్వానికి స్పష్టమైన సమాచారం ఉండాల్సిన అవసరం ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేయాలంటే ఆ వర్గాలకు సంబంధించిన ఖచ్చితమైన గణాంకాలు అవసరమని వ్యాఖ్యానించింది.

అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా చేరాలంటే కులగణన కీలక పాత్ర పోషిస్తుందని న్యాయమూర్తులు పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాలకు అవసరమైన చర్యలు తీసుకోవాలంటే వారి సంఖ్య ప్రభుత్వానికి తెలియాల్సిందేనని ధర్మాసనం స్పష్టం చేసింది. కులగణనకు వ్యతిరేకంగా పిటిషనర్లు వ్యక్తం చేసిన అభ్యంతరాలను ధర్మాసనం తోసిపుచ్చింది. విధాన నిర్ణయాల్లో న్యాయపరమైన జోక్యానికి అవకాశం లేదని మరోసారి స్పష్టం చేసింది. ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా కులగణన ప్రక్రియకు చట్టపరమైన స్పష్టత వచ్చినట్లయిందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. రాబోయే జనగణన ప్రక్రియలో కులాల లెక్కింపుపై ఇక ముందుకు వెళ్లేందుకు మార్గం సుగమమైందని విశ్లేషకులు చెబుతున్నారు.



## వడగాలులపై సీఎం అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి..)

సూచించారు. చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్య సమస్యలతో బాధపడేవారు మరింత జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. ఎండలో ఎక్కువసేపు తిరగడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాష్ట్రంలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ జిల్లా కలెక్టర్లకు అవసరమైన సూచనలు ఇవ్వాలని ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావును ఆదేశించారు. వడగాలుల ప్రభావాన్ని తగ్గించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం స్పష్టం చేసినట్లు సమాచారం.

## కేంద్రానికి భట్టి కీలక వినతి

(మొదటి పేజీ తరువాయి..)

తెలిపారు.విద్యా రంగ రూపాంతరానికి రాష్ట్ర ప్రభుత్వం ముప్పై వేల కోట్ల రూపాయల పెట్టుబడి ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. ఇందులో వంద ఐదు సమగ్ర నివాస పాఠశాలల నిర్మాణంతో పాటు ప్రభుత్వ కళాశాలలు, సాంకేతిక విద్యా సంస్థల అభివృద్ధి కూడా భాగంగా ఉంటుందని తెలిపారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించిన రుణాలను రాష్ట్ర ఆర్థిక పరిమితుల నుంచి మినహాయించాలని కేంద్రాన్ని ఉప ముఖ్యమంత్రి కోరారు. ఇవి సాధారణ ఖర్చులు కాకుండా భవిష్యత్ తరాల విద్యా సాధికారత కోసం చేపడుతున్న దీర్ఘకాలిక పెట్టుబడులని వివరించారు. వికసిత భారత్ లక్ష్య సాధనలో తెలంగాణ విద్యా, మౌలిక వసతుల పెట్టుబడులు కీలక పాత్ర పోషిస్తాయని భట్టి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తగిన మద్దతు అందిస్తే రాష్ట్ర అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## సీఎం రేవంత్‌ను కలిసిన ఐఏఎస్‌లు

(మొదటి పేజీ తరువాయి..)


ఉషా రాణి పాల్గొన్నారు. శిక్షణలో ఉన్న యువ అధికారులు ముఖ్యమంత్రితో సమావేశమై పరిపాలన, పాలనా విధానాలకు సంబంధించిన అంశాలపై చర్చించినట్లు సమాచారం.ముఖ్యమంత్రిని కలిసిన అధికారుల్లో ఎట్టబోయిన సాయి శివాని, సచిన్ బసవరాజ్ గుత్తూర్, పోతరాజు హరి ప్రసాద్, పారస్ కుమార్, పి. సురేష్, నెలటూరు శ్రీకాంత్ రెడ్డి ఉన్నారు. ఇటీవల సేవలో చేరిన ఈ అధికారులు ప్రస్తుతం శిక్షణ పొందుతున్నారు. పరిపాలనా రంగంలో కొత్తగా అడుగుపెట్టిన అధికారులకు ఇలాంటి సమావేశాలు విలువైన అనుభవాన్ని అందిస్తాయని అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సేవలపై ఉన్న అవగాహన మరింత పెరిగేందుకు ఇలాంటి భేటీలు ఉపయోగపడతాయని భావిస్తున్నారు.రాష్ట్ర పాలనలో యువ అధికారుల పాత్ర కీలకమని పలువురు అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తులో పరిపాలనా బాధ్యతలు నిర్వహించే అధికారులకు అనుభవజ్ఞులైన నాయకుల సూచనలు మార్గదర్శకంగా నిలుస్తాయని చెబుతున్నారు. శిక్షణ దశలో ఉన్న అధికారులకు ప్రభుత్వ విధానాలు, ప్రజా సంక్షేమ అంశాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర పరిపాలనలో సమర్థవంతమైన నాయకత్వం పెంపొందించడమే దీని ప్రధాన లక్ష్యంగా అధికారులు పేర్కొంటున్నారు.

## మోదీ--మట్టరెల్లా కీలక భేటీ

### భారత్--ఇటలీ సంబంధాలపై చర్చలు

### వాణిజ్యం, పెట్టుబడులపై ప్రత్యేక దృష్టి

### కృత్రిమ మేధస్సు సహా కీలక రంగాలపై చర్చ




**రోమ్, మే 20 (మన ప్రజాగళం):**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటలీ పర్యటనలో భాగంగా ఇటలీ అధ్యక్షుడు సెర్జియో మట్టరెల్లాను రోమ్‌లో కలిశారు. ఈ సందర్భంగా భారత్--ఇటలీ మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. ఇరు దేశాల మధ్య స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా సమావేశం జరిగినట్లు సమాచారం. ముఖ్యంగా వాణిజ్యం, పెట్టుబడులు, సాంస్కృతిక సంబంధాలపై ప్రత్యేకంగా చర్చించినట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. రెండు దేశాల మధ్య సహకారాన్ని మరింత విస్తరించేందుకు పలు అంశాలను పరిశీలించినట్లు తెలిపారు. అత్యాధునిక సాంకేతిక రంగాల్లో కూడా సహకారంపై చర్చలు జరిగాయి. కృత్రిమ మేధస్సు, కీలక ఖనిజాలు, అంతరిక్ష రంగం, అణుశక్తి వంటి వ్యూహాత్మక రంగాల్లో కలిసి పనిచేసే అవకాశాలపై అభిప్రాయాలు పంచుకున్నట్లు వెల్లడించారు.ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగంలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో పరస్పర భాగస్వామ్యం మరింత అవసరమని నేతలు భావించినట్లు తెలుస్తోంది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కొత్త భాగస్వామ్యాలకు మార్గం సుగమం చేసే అంశాలపై చర్చలు సాగినట్లు సమాచారం. ఇటీవలి కాలంలో భారత్--ఇటలీ మధ్య సంబంధాలు మరింత బలపడుతున్నాయి. వ్యాపారం, రక్షణ, సాంకేతిక రంగాల్లో ఇరు దేశాలు పరస్పర సహకారాన్ని పెంచుకుంటున్నాయి. ఈ సమావేశం కూడా ఆ దిశగా మరో కీలక అడుగుగా భావిస్తున్నారు. ఇరు దేశాల మధ్య స్నేహబంధాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఈ భేటీ ఉపయోగపడుతుందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. రాబోయే రోజుల్లో పలు రంగాల్లో సహకారం మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయని చెబుతున్నారు.

## పుతిన్ చైనా పర్యటన ఆసక్తికరం

**రోమ్, మే 20 (మన ప్రజాగళం):**



పుతిన్ చైనా పర్యటనలో భాగంగా బీజింగ్ చేరుకున్నారు. మంగళవారం రాత్రి చైనా రాజధానిలో అడుగుపెట్టిన పుతిన్‌కు చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటనకు అంతర్జాతీయ రాజకీయాల్లో ప్రాధాన్యం ఏర్పడింది. బుధవారం బీజింగ్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్ ద పీపుల్లో పుతిన్‌కు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ప్రత్యేక స్వాగతం పలికారు. ఇరు దేశాధినేతలు సమావేశమై ద్వైపాక్షిక సంబంధాలపై కీలక చర్చలు జరపనున్నారు.

ఈ సమావేశంలో ఉక్రెయిన్ యుద్ధ పరిస్థితులు, ఇరాన్‌కు సంబంధించిన పరిణామాలు, వాణిజ్యం, వ్యాపారం, రక్షణ రంగం వంటి అనేక అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం. ప్రపంచ రాజకీయాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలపై కూడా అభిప్రాయాలు పంచుకోనున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల పాటు పుతిన్ చైనాలో పర్యటించనున్నారు. ఈ పర్యటన సమయంలో పలు కీలక ఒప్పందాలు, వ్యూహాత్మక చర్చలు జరిగే అవకాశం ఉందని అంతర్జాతీయ వర్గాలు భావిస్తున్నాయి. రష్యా--చైనా సంబంధాల భవిష్యత్తుపై కూడా ఈ సమావేశం ప్రభావం చూపే అవకాశం ఉంది.ఇటీవలే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనా పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. ప్రపంచ అగ్రదేశాలైన అమెరికా, రష్యా అధ్యక్షులు తక్కువ వ్యవధిలోనే చైనాను సందర్శించడం ప్రపంచ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామంగా మారింది. చైనా పర్యటన సందర్భంగా పుతిన్ మాట్లాడుతూ రష్యా--చైనా సంబంధాలు ప్రస్తుతం ఉన్నత దశకు చేరుకున్నాయని వ్యాఖ్యానించారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతోందని ఆయన పేర్కొన్నట్లు సమాచారం.

# బచ్చన్నపేట నూతన ఎస్సైఎంపీడీఓ లను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



**బచ్చన్నపేట మే 20 మన ప్రజా గళం**

స్థానిక బచ్చన్నపేట మండల కేంద్రంలో నూతనంగా విచ్చేసినటువంటి బచ్చన్నపేట సబ్ ఇన్స్పెక్టర్ ఏ నవీన్ మరియు ఎంపీడీఓని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పైస రాజశేఖర్ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది ఈ సందర్భంగా పలు సామాజిక అంశాలు సమస్యలపై చర్చించడం జరిగింది మండలంలో శాంతిభద్రతల విషయంలో ఏ రాజీ పడబోనని బాధితులు స్వేచ్ఛగా పోలీస్ స్టేషన్ కి వచ్చి తమ ఫిర్యాదులను అందించవచ్చని అదేవిధంగా ఎంపీడీఓ మండలంలో అభివృద్ధి కార్యక్రమలను సజావుగా నిర్వహిస్తూ ఎస్సి కార్పొరేషన్ నిధులను అర్హులకు పారదర్శకంగా అందిస్తానని అభివృద్ధి పథం లో నడిపిస్తూ మండలాన్ని ముందు వరుసలో ఉంచుతామని వారు అన్నారని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ్ పాకల కుమారస్వామి,ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి అల్వాల రాజు ,అల్వాల విజయ్ ,కర్రె శ్రీనివాస్,ఎంఆర్పిఎస్ అల్వాల రాజేష్ ,అల్వాల శ్రీకాంత్ బందారం రమేష్ బొంకూరి శివాజీ గందమల్ల నాగరాజు పాల్గొన్నారు..



## ఆల్ యూనియన్స్, అసోసియేషన్ ఐక్యవేదిక ఆధ్వర్యంలో...

# దేశవ్యాప్త సమ్మె లో ఉమ్మడి మెదక్ జిల్లా బిఎస్ఎన్ఎల్ వర్కింగ్, విశ్రాంత ఉద్యోగులు

## జనవరి 26 నుండి ఐడిఏ బకాయిలను వెంటనే చెల్లించాలి...



**సంగారెడ్డి ప్రతినిధి,మన ప్రజాగళం ..**

భారత్ సంచార్ నిగం లిమిటెడ్ ( బిఎస్ఎన్ఎల్) లోని అన్ని యూనియన్స్, అసోసియేషన్ ఐక్య వేదిక పిలుపుమేరకు దేశ వ్యాప్తం సమ్మెలో పాల్గొన్న ఉమ్మడి మెదక్ జిల్లా బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు..గత జనవరి నెల నుండి పెండింగ్లో ఉన్న ఐ డి ఏ బకాయిలను తక్షణమే చెల్లించాలని, 2017 నుండి రావలసిన పే రివిజన్ ను అమలు చేస్తూ పెండింగ్ లో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంగారెడ్డి కేంద్ర కార్యాలయం ఎదుట ఉద్యోగులు డే లాంగ్ ధర్నాను నిర్వహించారు.. ఒకప్పుడు లాభాల బాటలో ఉన్న బిఎస్ఎన్ఎల్ ను కేంద్రంలో ఉన్న అధికార పార్టీలు నిర్వీర్యం చేయడం కాకుండా ఉద్యోగులకు2017 జనవరి నుండి రావాల్సిన పే రివిజన్ ఇవ్వకుండా కాలయాపన చేస్తూ, ధరల పెరుగుదలకు అనుగుణంగా ఇచ్చే ఐడిఏ జనవరి 26 నుండి వెంటనే చెల్లించాలని,పే రివిజన్ ను అమలు చేయాలని కోరుతూ బిఎస్ఎన్ఎల్ లోని అన్ని యూనియన్ అసోసియేషన్స్ వర్కింగ్, విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో డే లాంగ్ ధర్నా విజయవంతమైందని బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి, అధ్యక్షులు ఆల్ ఇండియా బిఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ జే. కిషన్ రావు తెలిపినారు.. ఈ కార్యక్రమంలో ఏఐబిడిపి ఏ, జిల్లా కార్యదర్శి బి కమలాకర రాజు, సర్కిల్ సహాయ కార్యదర్శి కొంక రాజేశ్వర్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ టెలికాం ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి వి.ధనంజయ, విశ్రాంత ఉద్యోగులు జిల్లా అధ్యక్షులు బి. నాగయ్య తో బాటు అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు

# దేవాలయ చోరీల నిందితుడి అరెస్ట్

- వరుస దొంగతనాలకు పాల్పడిన వ్యక్తి అదుపులో
- బంగారం, వెండి వస్తువులు స్వాధీనం
- నిందితుడిపై ఏడు కేసులు నమోదు

**రాజన్న సిరిసిల్ల, మే 20 (మన ప్రజాగళం):**




దేవాలయాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని కొనరావుపేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మోకినపల్లి బాబు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసుకు సంబంధించిన కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు పలు దేవాలయాల్లో చోరీలకు పాల్పడినట్లు తేలింది. వరుస ఘటనలపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు నిందితుడి కదలికలను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నిందితుడి వద్ద నుంచి బంగారు పుస్తెలు, వెండి కళ్లతో పాటు నగదు రెండు వేల రూపాయలు, స్పీకర్లు స్వాధీనం చేసుకున్నారు. చోరీకి గురైన వస్తువులను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.సాంకేతిక ఆధారాలు, స్థానిక సమాచారం ఆధారంగా నిందితుడిని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. చోరీ కేసుల దర్యాప్తులో పోలీసుల అప్రమత్తతతో కీలక పురోగతి సాధ్యమైందని పేర్కొన్నారు. నిందితుడిపై చందుర్తి సర్కిల్ పరిధిలో ఇప్పటికే ఏడు కేసులు నమోదైనట్లు సమాచారం. గతంలో కూడా పలు నేరాలకు పాల్పడిన చరిత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిపారు. దేవాలయాలు, ప్రజా ప్రదేశాల భద్రతపై ప్రత్యేక దృష్టి కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

# ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

**బచ్చన్నపేట మే 20 మన ప్రజా గళం**

బచ్చన్నపేట మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఒక యువతి, తనకు బంధువైన రసూల్ అనే వ్యక్తి గత కొంతకాలంగా ప్రేమిస్తున్నానని వెంటపడుతూ, ప్రేమ పేరుతో తనను మోసం చేశాడని ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి నిందితుడిని బుధవారం రోజున అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడం జరిగింది. యువత ఎటువంటి ఆకర్షణలకు లోనుకాకుండా జాగ్రత్తగా ఉండాలని, ఆన్‌లైన్ పరిచయాలు మరియు వ్యక్తిగత వివరాలు పంచుకోవడం విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని బచ్చన్నపేట ఎస్సై శ్రీకాంత్ తెలియజేశారు.

# రోడీషీటర్లకు కౌన్సెలింగ్

## ఎమ్మార్వో ఎదుట బాండ్ ఓవర్



**బచ్చన్నపేట మే 20 మన ప్రజాగళం**

బచ్చన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రోడీషీటర్లకుబుధవారం రోజునా పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగింది. వారు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, అనవసర విషయాలలో తలదూర్చవద్దని, సెటిల్‌మెంట్లు, దందాలు వంటి అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించడం జరిగింది.అనంతరం మొత్తం (08) మంది రోడీషీటర్లను సత్ప్రవర్తన కలిగి ఉండేలా తహసీల్దార్ ఎదుట బాండ్ ఓవర్ చేయించడం జరిగింది.ప్రజలు అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని, రోడీషీటర్లకు భయపడకుండా వారి చర్యలపై పోలీసుల నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.



# హెరిటేజ్ వాక్‌కు కలెక్టర్ శ్రీకారం

- పర్యాటక వారోత్సవాల్లో ప్రత్యేక కార్యక్రమం
- జాకారం శివాలయం వరకు హెరిటేజ్ వాక్ నిర్వహణ
- పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



**ములుగు, మే 20 (మన ప్రజాగళం):**

తొంభై తొమ్మిది రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న పర్యాటక వారోత్సవాల్లో భాగంగా ములుగు జిల్లాలో హెరిటేజ్ వాక్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఈ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ములుగు మండలం జాకారం యూత్ ట్రైనింగ్ సెంటర్ సమీప జాతీయ రహదారి వద్ద ప్రారంభమైన ఈ హెరిటేజ్ వాక్ జాకారం శివాలయం వరకు కొనసాగింది. చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యం ఉన్న ప్రాంతాలను ప్రజలకు పరిచయం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా అధికారులు తెలిపారు. పర్యాటక ప్రదేశాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడంతో పాటు స్థానిక వారసత్వ సంపదపై అవగాహన పెంచేందుకు హెరిటేజ్ వాక్ ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొన్నారు. పర్యాటక రంగ అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు. ప్రకృతి, సాంస్కృతిక, వారసత్వ పర్యాటక రంగాలను ప్రోత్సహించే దిశగా ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.హెరిటేజ్ వాక్‌లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలు పర్యాటక ప్రాంతాల విశిష్టతను తెలుసుకున్నారు. స్థానిక చరిత్ర, వారసత్వ కట్టడాలపై అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్ రెడ్డి, పర్యాటక శాఖ అధికారులు, పురావస్తు శాఖ ప్రతినిధులు, పర్యాటక గైడ్లు, టూరిస్ట్ పోలీసులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లాలో పర్యాటక రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

# ట్రాఫిక్ పోలీసులకు రక్షణ కిట్లు

**విధుల్లో ఉన్న సిబ్బందికి ప్రత్యేక కిట్ల పంపిణీ**

**ఎండ, వర్షంలో సేవలకు గుర్తింపు**

**ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యమన్న ఎస్పీ**

**సంగారెడ్డి, మే 20 (మన ప్రజాగళం):**

ఎండలు, వర్షాలు లెక్కచేయకుండా ప్రజల సురక్షిత ప్రయాణం కోసం విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక రక్షణ కిట్లను అందజేసింది. జిల్లా పోలీసు అధికారి పరితోష్ పంకజ్ ఈ కార్యక్రమంలో పాల్గొని ట్రాఫిక్ సిబ్బందికి కిట్లను పంపిణీ చేశారు. జిల్లా ప్రజల సురక్షిత ప్రయాణం ట్రాఫిక్ పోలీసుల ప్రధాన బాధ్యత అని ఈ సందర్భంగా ఎస్పీ పేర్కొన్నారు. ఎండ తీవ్రత, వర్ష పరిస్థితులు ఎలా ఉన్నా విధుల్లో నిబద్ధతతో పనిచేస్తున్న ట్రాఫిక్ సిబ్బంది సేవలు అభినందనీయమని కొనియాడారు. ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన తెలిపారు. రద్దీ కూడళ్లు, ప్రధాన రహదారులు, విద్యాసంస్థలు, వ్యాపార కేంద్రాల వద్ద నిరంతరం విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలందిస్తున్నారని పేర్కొన్నారు.వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నా ప్రజల భద్రత కోసం ట్రాఫిక్ పోలీసులు కష్టపడుతున్నారని చెప్పారు. వారి ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక రక్షణ కిట్లు అందజేసినట్లు వెల్లడించారు. ట్రాఫిక్ సిబ్బంది విధుల్లో మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు పోలీసు శాఖ చర్యలు తీసుకుంటోందని ఎస్పీ తెలిపారు. ప్రజల సహకారం కూడా ట్రాఫిక్ నియంత్రణలో కీలకమని అన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. రోడ్డు భద్రత విషయంలో నిర్లక్ష్యం ప్రాణాపాయానికి దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు.

మన తెలుగు దిన పత్రిక
ప్రజా గళం
గురువారం 21 మే 2026

# ఓటరు జాబితాపై కలెక్టర్ దృష్టి

- ప్రత్యేక సవరణ కార్యక్రమంపై సమీక్ష
- అర్హులందరికీ ఓటు హక్కే లక్ష్యం
- రాజకీయ పార్టీల సమన్వయం అవసరం



**జోగులాంబ గద్వాల, మే 20 (మన ప్రజాగళం):** జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు.తెలంగాణ రాష్ట్రంలో ఇరవై నాలుగు సంవత్సరాల తర్వాత ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండువేల రెండులో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు గుర్తుచేశారు. అక్టోబర్ ఒకటి రెండువేల ఇరవై ఆరు నాటికి పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు మారిన వారు, డూప్లికేట్ ఓట్ల తొలగింపు కూడా ఇందులో భాగమని చెప్పారు. ప్రస్తుత ఓటరు జాబితాను రెండువేల రెండు నాటి ఓటరు జాబితాతో అనుసంధానం చేస్తున్నట్లు వివరించారు. పాత జాబితాలో లేని వారు తమ తల్లిదండ్రులు లేదా తాతముత్తాతల వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు.జూన్ ఇరవై ఐదు నుంచి జూలై ఇరవై నాలుగు వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తారని కలెక్టర్ తెలిపారు. ప్రజలు పూర్తి వివరాలతో నమోదు ఫారాలను సమర్పించి తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. జూలై ముప్పై ఒకటో తేదీన ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తామని, ఆగస్టు ముప్పై వరకు అభ్యంతరాలు, కొత్త దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. అక్టోబర్ ఒకటో తేదీన తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఓటర్లు తమ వివరాలను పరిశీలించి అవసరమైతే దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఒక్క అర్హుడైన ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

- లోడింగ్, అన్‌లోడింగ్‌పై ప్రత్యేక దృష్టి
- కొనుగోలు కేంద్రంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
- రైతులకు సకాలంలో చెల్లింపులపై సూచనలు



**జనగామ, మే 20(మన ప్రజాగళం):** జిల్లాలో ధాన్యం కొనుగోలు, రవాణా ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో లోడింగ్, అన్‌లోడింగ్ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.బుధవారం లింగాల ఘనపూర్ మండలం జీడికల్ గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియను నిశితంగా పరిశీలించి కేంద్రం పనితీరుపై ఆరా తీశారు. ఇప్పటివరకు జరిగిన ధాన్యం కొనుగోళ్ల వివరాలు, రిజిస్టర్ నిర్వహణ, ట్యాబ్ నమోదు ప్రక్రియ, లోడింగ్, అన్‌లోడింగ్ పనులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ధాన్యం బస్తా బరువు నలభై ఒకటి కిలోలు మాత్రమే ఉండాలని స్పష్టం చేశారు. అదనపు బరువు ఉండకుండా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియ వేగంగా పూర్తయ్యేలా తగిన సంఖ్యలో హమాలీలను అందుబాటులో ఉంచాలని సూచించారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలని కేంద్ర నిర్వాహకులకు ఆదేశించారు. ట్రక్కులతో ధాన్యం తరలించే సమయంలో కేంద్రానికి చెందిన బాధ్యులు వెంట వెళ్లి అన్‌లోడింగ్ త్వరగా పూర్తయ్యేలా పర్యవేక్షించాలని తెలిపారు. ట్యాబ్‌లో నమోదు ప్రక్రియను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. నమోదు ప్రక్రియ ఆలస్యం కాకపోతే రైతుల ఖాతాల్లో నగదు సకాలంలో జమ అవుతుందని పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు.



# ప్రజాసేవపై ఎస్పీ కీలక సూచనలు

- కోస్గి పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ
- క్రమశిక్షణ, సమయపాలనపై ప్రత్యేక దృష్టి
- సైబర్ నేరాల నివారణకు కీలక ఆదేశాలు




**నారాయణపేట, మే 20 (మన ప్రజాగళం):** పోలీసు అధికారులు క్రమశిక్షణ, సమయపాలనతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా పోలీసు అధికారి డాక్టర్ వినీత్ సూచించారు. కోస్గి పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన వార్షిక తనిఖీలో పోలీసు వ్యవస్థ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ నిర్వహణ, రికార్డులు, నేర నియంత్రణ చర్యలు, పెండింగ్ కేసులపై ఎస్పీ ఆరా తీశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో విలేజ్ పోలీస్ అధికారులు తరచూ పర్యటించాలని ఎస్పీ ఆదేశించారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో పాటు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవాలని సూచించారు.రోడ్డు భద్రతపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు తెలిపారు. ప్రమాదాల నివారణకు ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గించే దిశగా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇటీవలి కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని ఎస్పీ పేర్కొన్నారు. ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ నేరాలపై గ్రామస్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పోలీసు వ్యవస్థ ప్రజలకు మరింత చేరువ కావాలని ఎస్పీ తెలిపారు. బాధితులకు సకాలంలో న్యాయం అందేలా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. ప్రజల విశ్వాసాన్ని పెంచే విధంగా పోలీసు సేవలు ఉండాలని పేర్కొన్నారు.

# ఉపాధి హామీపై కలెక్టర్ దృష్టి

- కూలీల సంఖ్య పెంపుపై ప్రత్యేక దృష్టి
- పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచన
- గ్రామీణ అభివృద్ధి లక్ష్యాలపై సమీక్ష



**జోగులాంబ గద్వాల, మే 20(మన ప్రజాగళం):** జిల్లాలో ఉపాధి హామీ పనులను మరింత వేగవంతం చేయడంతో పాటు కూలీల సంఖ్య పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ, మహిళా స్వయం సహాయక సంఘాలు, కుటుంబ ప్రయోజన పథకాలు తదితర అంశాలపై నిర్వహించిన వీడియో సమావేశంలో ఆయన పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, మహిళా సంఘాల సంస్థ ప్రధాన కార్యనిర్వాహక అధికారి దివ్య దేవరాజన్ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులు వేగవంతం కావడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.కొత్త ఉద్యోగ కార్డుల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని సమావేశంలో సూచించారు. ఉపాధి హామీ కూలీలకు పూర్తి పని దినాలు లభించేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులు కుటుంబ ప్రయోజన పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.దివ్యాంగులకు ప్రత్యేక గుర్తింపు కల్పించే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ప్రత్యేక గుర్తింపు కార్డులపై అవగాహన పెంచాలని సమావేశంలో పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేయాలని సమావేశంలో చర్చించారు. మహిళల ఆర్థిక సాధికారతకు సంఘాలు కీలకంగా మారుతున్నందున అవసరమైన సహకారం అందించాలని అధికారులకు సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ కూలీలు ఉదయం ఏడు గంటలలోపు పనిస్థలాలకు చేరుకునేలా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు. ఎండ తీవ్రత కారణంగా కూలీలకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవనాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, మహిళా సంఘాల భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు. గ్రామీణాభివృద్ధిలో జిల్లా రాష్ట్రస్థాయిలోనే కాక దేశవ్యాప్తంగా కూడా మెరుగైన గుర్తింపు పొందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు.




# వానాకాలంపై కలెక్టర్ కీలక సూచనలు

- విత్తన డీలర్లకు అవగాహన కార్యక్రమం
- నాణ్యత, ధరల్లో ఎలాంటి రాజీ వద్దు
- నకిలీ విత్తనాలపై కఠిన చర్యల హెచ్చరిక




**జనగామ, మే 20 (మన ప్రజాగళం):** వానాకాలం రెండువేల ఇరవై ఆరు సీజన్‌కు సంబంధించి జిల్లాలో ముందస్తు సన్నాహక చర్యలు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులకు సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల డీలర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీలర్లు నాణ్యత లేని లేదా అనుమతి లేని విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించరాదని కలెక్టర్ హెచ్చరించారు. ప్రభుత్వం లేదా సంబంధిత సంస్థలు నిర్ణయించిన ధరలకే విత్తనాలు, ఎరువులు విక్రయించాలని సూచించారు. తెల్ల కాగితాలపై విక్రయాలు చేయకుండా తప్పనిసరిగా అసలు బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి బిల్లుపై డీలర్, రైతు సంతకాలు ఉండాలని స్పష్టం చేశారు.డీలర్లు తమ వద్ద ఉన్న విత్తనాలు, ఎరువుల నిల్వ వివరాలను బోర్డులపై స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు. రైతులు స్పష్టమైన సమాచారంతో సరుకులు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత ఏడాది జిల్లాలో అధిక దిగుబడులు సాధించినట్లు గుర్తు చేసిన కలెక్టర్, ఈ వానాకాలంలో కూడా అదే స్థాయి లక్ష్యంతో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతుల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా ప్రతి డీలర్ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ఎరువుల కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలకు అవకాశం ఇవ్వబోమని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లా, మండల స్థాయి అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఎరువుల నిల్వలు, సరఫరాపై నిఘా కొనసాగించాలని సూచించారు. నకిలీ విత్తనాలు, నాణ్యత లేని ఎరువుల సరఫరాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన ఉత్పత్తులు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారులు, డీలర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# ఫిర్యాదుల విచారణలో పారదర్శకత

**వరంగల్, మే 20 ((మన ప్రజాగళం):** పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో పారదర్శకంగా విచారణ నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అధికారులకు సూచించారు. బాధితులకు అండగా నిలుస్తూ సమస్యల పరిష్కారంలో సమర్థంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. బుధవారం ఈస్ట్ జోన్ పరిధిలోని చెన్నరావుపేట పోలీస్ స్టేషన్‌ను కమిషనర్ సందర్శించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ పోలీస్ కమిషనర్‌కు స్వాగతం పలికారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించిన కమిషనర్ అక్కడి పనితీరుపై సమీక్ష చేపట్టారు. స్టేషన్ రిసెప్షన్, సమాచార సాంకేతిక సిబ్బంది, ఇతర పోలీస్ సిబ్బంది పనితీరును కమిషనర్ పరిశీలించారు. స్టేషన్ నిర్వహణకు సంబంధించిన రికార్డులు, రౌడీ షీటర్లు, అనుమానితుల వివరాలు, పెండింగ్ కేసుల రికార్డులను తనిఖీ చేశారు.స్టేషన్ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమైన కమిషనర్ వారి సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సేవలందించే క్రమంలో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీసి అవసరమైన సూచనలు చేశారు. ప్రతి కానిస్టేబుల్ గ్రామాల్లో పర్యటించి స్థానికంగా ఉన్న శాంతిభద్రతల పరిస్థితులను తెలుసుకోవాలని ఆదేశించారు. గ్రామస్థుల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించి రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్రమ ఇసుక రవాణా, పాఠశాలల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. ప్రజా భద్రతకు విఘాతం కలిగించే అంశాలపై రాజీ లేకుండా వ్యవహరించాలని కమిషనర్ స్పష్టం చేశారు.